క్లుప్తంగా

డివిజన్ ఏర్పాటుకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలను కలుపుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం ఆయన మంత్రిని కలిసి చేర్యాల ప్రాంత ప్రజల సమస్యలను వివరించారు. కోర్టు సిబ్బంది నియామక జీఓ జారీ అయిందని, అలాగే రెవెన్యూ డివిజన్ కూడా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ తీరుతుందని తెలపగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కిరణ్‌కుమార్ చెప్పారు.

నీటి సరఫరాకు చర్యలు



పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురిగ్రామ శివారులోని నల్లపోచమ్మ ఆలయంతో పాటు సమీప దుకాణాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ గూడెపు మహేశ్ చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కృష్ణ, ఏఈ దివ్యతో కలిసి గురువారం ఆయన ఆలయ పరిసరాలని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారన్నారు. వారి వెంట కార్యదర్శి రాజు తదితరులున్నారు.

'నేను చదివిన పుస్తకం'పై చర్చ

సిద్దిపేటఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో గురువారం 'నేను చదివిన పుస్తకం' అనే అంశంపై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమకు నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకుని దాని ప్రాధాన్యంపై చర్చించారు. తోటి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్‌కుమార్ రెడ్డి, అధ్యాపకులు దాసు, వెంకటరమణ, నరేశ్, శైలజ, విద్యార్థులు భవాని, జైపాల్, వెంకటేశ్, అంకిత, రమ్య, అంజలి, రేఖ, రోజా తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



శిక్షణ ఇస్తున్న మాస్టర్ శ్రీకాంత్

దుబ్బాకటౌన్: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతో దోహదపడుతుందని, చదువుతో పాటు కరాటేపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన కరాటే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మానసిక, శారీరక ధృడత్వానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ధర్మాజీపేట హెచ్‌ఎం ఎండీ సాదత్ అలీ, సీఆర్పీ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ చేయూత



సైకిల్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): శత శాతం హాజరు నమోదైన విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం ప్రథమ బహుమతిగా రూ.3,500 విలువగల సైకిల్, ద్వితీయ బహుమతిగా క్యారం బోర్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు ప్రభుత్వ బడిలో చేరేలా చేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పర్వతాలుయాదవ్, ఉపాధ్యక్షుడు చంద్రం, కార్యదర్శి బాబు, కోశాధికారి కుమార్, సలహాదారుడు అనిల్, సభ్యులు మోహన్, రాంబాబు, హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు డి.అయిల్‌రెడ్డి, ఆంజనేయులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- ఎంఈఓలు, ఉపాధ్యాయులు
- ఉత్సాహంగా చెకుముకి పోటీలు



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ పద్మయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్/కోహెడ(హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్)/జగదేవ్‌పూర్: విజ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అర్బన్, రూరల్, నారాయణరావుపేట మండల స్థాయి సైన్సు ప్రతిభా పోటీలను సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అర్బన్, రూరల్ ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి హాజరయ్యారు. 45 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు మహేందర్, రమేశ్, నరసింగరావు, అజీజ్, పోచయ్య, అరుణ, నరేందర్, శ్రీనివాస్, సుధాకర్, సత్యం, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ సంబురాల్లో ఎంఈఓ ప్రవీణ్‌బాబు మాట్లాడారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రవీందర్, ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వంశీ, స్వర్ణలత, శైలజ పాల్గొన్నారు. గజ్వేల్ పరిధిలోని పిడిచెడ్ ఉన్నత పాఠశాల, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఉన్నత పాఠశాల, ముట్రాజ్‌పల్లి మోడల్ స్కూల్, సెయింట్ జేవియర్ స్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఎంఈఓ కృష్ణ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. కరీమొద్దీన్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. కోహెడలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ పద్మయ్య పాల్గొన్నారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా కోహెడ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, శనిగరం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్టు చెప్పారు. బుడుగ రాజేందర్, నగేశ్, మహేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు, ధూళ్మిట్ట మండల కేంద్రాలలో నిర్వహించిన చెకుముకి పోటీలలో ప్రథమ స్థానంలో మద్దూరు, ద్వితీయ స్థానంలో లద్నూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిలిచారు. రెసిడెన్షియల్ విభాగంలో మద్దూరు మోడల్ స్కూల్ ప్రథమ స్థానంలో, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, చంద్రశేఖర్‌వర్మ, సర్వర్, చంద్రబాను, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, కరుణాకర్, రఘుపతి, ప్రమోదిని, కనుకయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు. ధూళ్మిట్ట ప్రథమస్థానంలో, భైరాన్‌పల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈఓ మీనాంజనేయులు, హెచ్‌ఎంలు కరుణాకర్‌రెడ్డి, సతీశ్, ఉపాధ్యాయులు నాగరాజు, రాములు, రవికుమార్, హరిబ్రహ్మం పాల్గొన్నారు. చేర్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ రచ్చ కిష్టయ్య పాల్గొన్నారు. మండలంలో సుమారు 2వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. ఆకునూరు, చేర్యాల, వికాస్ గ్రామర్, ముస్త్యాల గురుకుల పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. హెచ్‌ఎంలు సంధ్యారాణి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు యాదగిరి, కొండల్‌రెడ్డి, రవీందర్, వేణుగోపాల్, సుధాకర్, పురుషోత్తం, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు. కొండపాక, కుకునూరుపల్లి హైస్కూళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో ఎంఈఓ మాధవరెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం కనకయ్య, సైదులు, రామచంద్రం, ఉపాధ్యాయులు పోచయ్య, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బహుమతులు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు



మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులతో ఎంఈఓ ప్రవీణ్ బాబు తదితరులు

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వండి

వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో పాల్గొన్న దివ్యాంగులు

హుస్నాబాద్: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్)ఆధ్వర్యంలో పింఛన్ల సాధనకై గురువారం దివ్యాంగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు నెలకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు సబ్సిడీపై వాహనాలు ఇవ్వాలని కోరారు. క్యాంప్ నిర్వహించిన సదరన్ సర్టిఫికెట్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. దివ్యాంగుల హక్కులసాధనకై 26న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు రాజేశ్వరి, సమ్మయ్య, రమేశ్, వెంకటలక్ష్మి, వసంత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్



సిద్దిపేటకమాన్: సూచనలిస్తున్న ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాజీవ్ రహదారికి రెండు వైపులా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని కోరారు.

అభయ్ యాప్‌తో భద్రత

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రయాణికుల భద్రత కోసం అభయ్ యాప్ సహాయ పడుతుందని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. ఎస్‌ఐ రాజుతో కలసి గురువారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆటోలకు యాప్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో ప్రయాణిస్తున్న వారు ఆపదలో ఉంటే యాప్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి వివరాలు, లోకేషన్ ఎంటర్ చేయాలన్నారు. అలా చేయగానే పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకు వాహనం లొకేషన్ వెళ్తుందని, దీంతో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని చెప్పారు. పోలీసులు వెంటనే ప్రయాణికులను కాపాడతారని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ధరలు తగ్గించకపోతే ఆందోళన బాట

మిరుదొడ్డి(దుబ్బాక)/కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, లేదంటే ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి హెచ్చరించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో గురువారం పార్టీ ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల స్కీంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో గోపాల స్వామి, శశిధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లిలో బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ మొదటి, రెండో తేదీలలో గజ్వేల్‌లో నిర్వహించే జిల్లా మహాసభలో పార్టీ చేసిన పోరాటాలు, ఉద్యమాలపై చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించి చర్చించేందుకు మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రవీందర్, శారద, వరలక్ష్మి, సాయిలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు తీవ్రగాయాలు

వర్గల్(గజ్వేల్): బైక్‌ను లారీ ఢీకొనడంతో బైకిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి వర్గల్ మండలం అనంతగిరిపల్లి చౌరస్తా వద్ద గజ్వేల్-తూప్రాన్ రహదారిపై జరిగింది. రాత్రి వర్గల్ మండలం నాచగిరి సమీపంలోని అనంతగిరిపల్లి చౌరస్తా వద్ద బైక్ మీద వెళ్తున్న వ్యక్తిని తూప్రాన్ నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది వెళ్లిపోయింది. నాచగిరి వద్ద స్థానికులు లారీని ఆపేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బైకిస్టు పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ఆసుపత్రికి అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుని వివరాలు తెలియాల్సి ఉన్నది.

రూ.15వేల జరిమానా

బెజ్జంకి(సిద్దిపేట): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో మండలంలోని నలుగురు యువకులకు రూ.15వేలు జరిమానా విధించినట్టు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని ముత్తన్నపేటలో 2017లో ఒక మహిళను నలుగురు వేధించారు. అప్పటి ఎస్‌ఐ కేసునమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చారు. హుస్నాబాద్ కోర్టులో విచారణ కొనసాగింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి కృష్ణతేజ్ నలుగురికి రూ.15వేల జరిమానా విధించారు.

మందుబాబులకు..

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఐదుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.8,500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు(గజ్వేల్): కొక్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా కొత్తూరు, కొక్కొండ, సింగన్నగూడ, శ్రీరాంపూర్ గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సేంద్రియ ఎరువులను తయారు చేయాలి

- నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు
- డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్..



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి, మల్లంపల్లి, గొల్లపల్లి, కేశవాపూర్, మంచినీళ్ల బండ గ్రామాల్లో డంపింగ్ యార్డులను డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. గత 19న 'సేంద్రియ తయారీ ఎక్కడ?' నిరుపయోగంగా డంపింగ్ యార్డులు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు స్పందించారు. గురువారం ఆయన గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించి మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్మించిన ప్రతి డంపింగ్ యార్డులోను తప్పకుండా సేంద్రియ ఎరువులను తయారు చేసి మొక్కలకు వాడాలని ఆదేశించారు. అదేవిధంగా వానపాములను ఉత్పత్తి చేయాలని, తయారైన ఎరువులను రైతులకు విక్రయిస్తే పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుందని సూచించారు. తడి, పొడి చెత్తలను సైతం వేరుచేయాలని, సేంద్రియ తయారీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సత్యనారాయణ



శంకుస్థాపన చేస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట): ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తోటపల్లిలో రూ.20లక్షలతో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. అలాగే దాచారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దాచారం పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్ సమకూర్చిన క్రీడా దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంఈఓ మహతిలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, హెచ్‌ఎం మల్లారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, చేప్యాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా మారుద్దాం

- పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించండి
- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



సమస్యల గురించి తెలుసుకుంటున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతోను, అలాగే బల్దియా సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయడంతోను ఆదర్శ సిద్దిపేట దిశగా అడుగులు వేద్దామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. స్థానిక 13వ వార్డులో కౌన్సిలర్ వినోభాతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. వార్డుల్లో ప్రజలు తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాల సిబ్బందికి అందజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, బ్లాక్ స్పాట్స్ కట్టడికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం వార్డుల్లో సమస్యల గురించి తెలుసుకున్నారు. మాంసం విక్రయ దుకాణాలు తనిఖీ చేశారు. ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో చదువులు భారం

ఏఐఎస్ఎఫ్ జిల్లా నేత నరేశ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమతువున్నారన్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్ అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బకాయిల విడుదల కోసం రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు బంద్ చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజా విజయోత్సవాల నిర్వహణకు ఉన్న పైసలు ఫీజుల బకాయిల విడుదలకు లేవా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో శిరీష, కార్తీక్, సాయికిరణ్, రమేశ్, రాజు, స్వప్న, అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నగదు బదిలీ చేయాలి



పోతారం(ఎస్)లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మత్స్యకారులు

హుస్నాబాద్‌రూరల్/బెజ్జంకి(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్/వర్గల్(గజ్వేల్): చేపల పెంపకానికి సబ్సిడీపై చేపపిల్లలను ఇవ్వకుండా మత్స్యకార సంఘాలకు నగదు బదిలీ చేయాలని జిల్లా నాయకుడు పెండ్యాల అయిలయ్య కోరారు. గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పోతారం(ఎస్)లో జెండా ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులకు ఆసరా పథకంలో ఫించన్ మంజూరుచేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేశ్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకిలో నిర్వహించిన కార్యక్రమంలో 200 మంది బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోచయ్య, మాజీ సర్పంచ్ మొండయ్య, రాజేందర్, రమేశ్, లక్ష్మణ్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ మత్స్యకార వేడుకల్లో నారాయణరావుపేటకు చెందిన ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్‌ను కలిసిన బాబేష్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. వర్గల్ మండలంలోని తున్కిఖల్సాలో నిర్వహించిన కార్యక్రమంలో వర్గల్ మండల ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు శ్రీరాం నర్సింహులు మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో ముదిరాజ్‌లకు ప్రభుత్వం, రాజకీయ పక్షాలు సముచిత ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ముదిరాజ్‌లలో చైతన్యం, వారి అభ్యున్నతి ధ్యేయంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాగరాజు, నాగరాజు, లక్ష్మణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు చట్టాలపై అవగాహన

దుబ్బాకరూరల్: హబ్సిపూర్ పాఠశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, గంజాయి, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ సోషల్‌మీడియా సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. హెచ్‌ఎం చక్రపాణి, షీటీమ్ బృందం కిషన్, మమత, వీణకుమారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ 'మత్తు'కు బానిసలు కావొద్దు

కొండపాక(గజ్వేల్): మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎస్‌ఐ సురేశ్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని వెలికట్ట శివారులో గల శ్రీ కృప ఫార్మసీ కళాశాలలో గురువారం మత్తు పదార్థాల వినియోగం, అనర్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ మంజునాథ్, ప్రొఫెసర్ గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజాసంకల్ప దీక్షను జయప్రదం చేయండి

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ సాధించేందుకు ప్రజా సంకల్ప దీక్ష నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో సంకల్ప దీక్షకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బలమైన నాయకత్వం లేకపోవడం వల్ల చేర్యాల ఉనికి, అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆగంరెడ్డి, శశిధర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఉమారాణి, అశోక్, బీరయ్య, చంద్రం, రమణారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ పుల్లూరు చెరువులో నీళ్లు నింపాలి

సిద్దిపేటరూరల్: పుల్లూరు గ్రామ చెరువులో నీళ్ళు నింపాలని కోరుతూ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు గురువారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ చెరువు నిండితే రైతులకు మేలు కలుగుతుందని, మంత్రులు, కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. తిరుపతిరెడ్డి, మురళి, జస్వంత్‌రెడ్డి, రాములు, లచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

◆ మోడల్ స్కూల్ పరిశీలన

జగదేవ్‌పూర్: స్థానిక మోడల్ స్కూల్‌ను మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంటర్మీడియెట్, పదో తరగతి విద్యార్థులతో సమావేశం అయ్యారు. విద్యాబోధన, మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం లాంగ్ జంప్ పీట్‌ను ప్రారంభించారు. ఎంఈఓ మంజరి, రవికుమార్, ప్రిన్సిపాల్ కాట స్లీవ రాజు, రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ఒప్పందం అభినందనీయం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు కలిసి పనిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో వారు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారుల సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కళాశాలల వాలంటీర్లు రాష్ట్ర, జాతీయ కార్యక్రమాలను కలిసి నిర్వహించుకుంటారన్నారు. శ్రద్ధానందం, నగేశ్, అయోధ్యరెడ్డి, గోపాలసుదర్శనం, కనకచంద్రం, రాణి, పుణ్యమ్మ, కృష్ణయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుదాస్ కుమారుడి మృతి బాధాకరం

సిద్దిపేటరూరల్: జక్కాపూర్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ జాతీయ ఆర్గనైజర్, తెలంగాణ ఇన్‌చార్జి కొంపల్లి ప్రభుదాసు కుమారుడు సాగర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారికశాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొంపల్లి సాగర్ కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రభుదాస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

◆ రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేటజోన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23న స్థానిక స్టేడియంలో బాలల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి వెంకట్ స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 8501977079, 9666020322 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

◆ ఒకరిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): కత్తితో దాడిచేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదైందని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. గ్రామానికి చెందిన సీహెచ్ దేవేందర్‌పై అదే గ్రామానికి చెందిన కామాద్రి రాజ్‌కుమార్ కత్తితో దాడి చేశాడు. దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.